వెనకటి రోజులు...

పాలకోడేటి సత్యన్నారాయణరావు



మా కాలనీలో ఇళ్లన్నీ దగ్గర దగ్గరే వున్నాయన్న సంగతి నాకు తెలుసుకానీ మరీ ఇంత దగ్గర అని మాత్రం తెలీదు — ఆ సంగతి ఆ అంటువ్యాధి మా యింటిలోకి వచ్చేవరికి తెలిసింది.

ఎన్నాళ్ళనుంచి అనుకొంటూవుందోగానీ, ఆ ఆదివారంనాడు మధ్యాహ్నం, కొంచెం విశ్రాంతి తీసుకొందామా అనుకొంటున్న సమయంలో, రేడియో కట్టేసి, ఫ్యాన్ ఆన్‌చేసి, నెమ్మదిగా మంచం దగ్గరకు చేరింది శోభ. శ్రీమతి దగ్గరగా చేరగానే ఏదో ఒకటి కోరడానికే వచ్చింది అని అనుకోవటం మర్యాద కాదుగదా! అయినా కీడెంచటం మేలనే నియమంవున్న మనిషిని కాబట్టే, అటువక్కకు తిరిగాను.

పక్కనే కూర్చుని నెమ్మదిగా అంది శోభ "మీరేమీ అనుకోనంటే, ఒకటి చెబుతాను."

శోభకేసి తిరిగాను — "చెప్పు."

"ఏమీ అనుకోరుగా ?" మళ్లీ అడిగింది.

ప్రమాదాన్ని శంకించినా అన్నాను — "ఏమీ అనుకోనులే, చెప్పు."

క్షణం ఆగి అంది శోభ — "మనం వ్యాపారం చేద్దామండీ !"

ఉలికిపడ్డాను — ఏమంది శోభ? వ్యాపారమా ? ఏం వ్యాపారం ? అయినా మా వంశంలో అటు యిటూ ఎన్నితరాల చరిత్ర తిరగేసి చదివినా, వ్యాపారవేత్త ఒకడూ వుండివుండడు. శోభకు ఎందుకు వచ్చింది యీ అయిడియా ?

అయినా పెట్టుబడో ?

ప్రశ్నలన్నీ నావి. "వ్యాపారం? ఏం వ్యాపారం? యెందుకు వ్యాపారం ? యెలా చేయాలి ? ..." ఇత్యాదులన్నీ అడిగాను.

శోభ వీటన్నిటి గురించి ముందే ఆలోచించింది కాబోలు, నా ప్రశ్నలన్నీ సీర్లీగా తోచి, అవన్నీ పక్కకు కొట్టేస్తున్నట్లుగా అంది — "ముందు ఊ అనండి. మిగతా అన్నిటికీ నేను దారి చూపిస్తాను,"

ఎంత గొప్ప అభయప్రదానం !

కానీ, శోభకు యింత తెలివితేటలు ఎక్కడివి? వాళ్ళ యింట్లో ఏ ఒక్కరూ పనికివచ్చినవాళ్ళల్లో లేరన్నది నాకుమాత్రం తెలిసిన నిజం.

"ముందు నీ సంగతి చెప్పు." అన్నాను నేను మళ్లీ.

అయినా శోభ దగ్గర నేనే ఓడిపోయాను — మొత్తానికి నరే అనిపించింది నాచేత. బహుశా వ్యాపారం చేయటంవల్ల లక్షాధికారిని కాకపోయినా, బాగా డబ్బు సంపాదించగలమనే ఊహ నాలోనూ ఉందేమో, అందుకే ఊ అన్నట్టున్నాను ?

శోభ నోరు విప్పింది విని ఉలికిపడ్డాను. భార్యకు అన్ని విషయాలు చెప్పకోవటంలో ఎంత ఆనందం వుందో అనే అనుకున్నానుగానీ, అదెంత తెలివితక్కువ పనో తెలీలేదు నాకు ! "మీ ఆఫీసులో సొసైటీవాళ్లు మీకు అయిదువేలు అప్పు యిస్తారు గదా !" అంది శోభ.

"ఊరికేకాదు, నెలనెలా వడ్డీ కట్టాలి, తెలుసా ?"

"ఫర్వాలేదు, కట్టేద్దాం !"

"అంటే, అంత లాభం ఉండే వ్యాపారమా మనది ?"

"చెప్తా, ఆగండి. ముందు మీ ఆఫీసులో లోన్‌కు అప్లై చేయండి. ఆ తర్వాత సంగతి తర్వాత..."

"శోభా, ఒక ప్రశ్న — మనం అయిదువేలతో ఏం చేస్తాం వ్యాపారం ? ఇంటద్దె కట్టాలి, వడ్డీ కట్టాలి, మన కష్టం..."

"మీకు మీ ఆఫీసువాళ్లు గాబట్టి ఉద్యోగం యిచ్చారుకానీ, బొత్తిగా బుర్రే లేదండీ మీకు — యెలా నెగ్గుకొస్తున్నారో ఏమో వాళ్ళు !" అంటూ మా ఆఫీసువాళ్లమీద బోలెడంత సానుభూతి చూపిస్తూ అంది — "మనం ఇంటద్దె అంటూ కట్టనక్కర్లేదు. ఎందుకంటే వ్యాపారం జరగబోయేది మన యింట్లోనే ! పోతే మన కష్టం అంటే, పెద్ద కష్టం అంటూ ఉండదు. ఉన్నా లాభం వుంటుందికదా !"

"మనం చేసేది యింతకూ ఏం వ్యాపార

మంటావ ?'' బితుకు బితుకుగానే అడిగాను — శోభ ఆ వ్యాపారరహస్యం చెబుతుందో చెప్పదో ననుకుంటూనే.

"అదే ఇంకా తట్టలేదండీ! అయినా ఫర్వాలేదు, ఆలోచిస్తా వుండండి!..." అంటూ శోభ ఆలోచన పైకే చేయడం మొదలుపెట్టింది. "చీరలు, అవీ లాభంలేదు, వాటిల్లో మనం మాధవి వాళ్లను యీరోజు దాటలేం. పోతే దుప్పట్లూ వగైరా కూడా లాభంలేదు, అవి కృష్ణవేణి వాళ్లు చేస్తూనేవున్నారు. ఫర్నిచర్ వగైరా ఆ వడ్రంగివాళ్లు, అదేనండీ, ఆ మూల వుండే మీ కుమార్‌వాళ్లు చేస్తూనేవున్నారు..."

నాకు కొంచెం జ్ఞానోదయం అయింది — శోభ చెబుతున్న మాధవి, కృష్ణవేణి — వీళ్లంతా శోభకు మంచి ఫ్రెండ్స్. మా కాలనీలో ఎవర్ని వాళ్ల గురించి అడిగినా చెబుతారు. మొగుళ్లను యింట్లోపెట్టి తాళంవేసి, ప్రపంచాన్ని అమ్మకు రాగలిగినవాళ్లు వాళ్లు. శోభ అన్నట్లు వాళ్లను జయించటం కష్టం.

అంటే, శోభకు యీ విషయంలో ఇన్స్పిరేషన్ వాళ్లన్నమాట!!

"శోభా!" అంటూ శోభను ఆలోచనల్లోంచి నేలమీదకు దింపి ఓ ప్రశ్న వేశాను — "వాళ్ళకు అది అలవాటయిపోయింది. నువ్వు అలా చేయలేవనే నా నమ్మకం!"

శోభ నవ్వింది — "మీరలానే అనుకొంటారు, కానీ వాళ్ళుకూడా పుట్టినప్పట్నించీ వ్యాపారులు కారు గదా! మీకెందుకు, మీరూరుకోండి, అన్ని విషయాలు నేను చూసుకొంటాను."

ఏం చేస్తానుమరి? ఊఁ అన్నాక తప్పదుగదా! అయినా శోభ తల్చుకొంటే చెయ్యగలదనే నమ్మకం నాకు వుండనే వుంది.

"ఊఁ — మనం స్టెయిన్‌లెస్‌స్టీల్ సామాన్ల వ్యాపారం చేద్దామండీ!" అన్న శోభ, మరునాడు ఆ వ్యాపారానికి కావాల్సిన బేసిక్ ఇన్ఫర్మేషన్ అంతా తీసుకొచ్చింది. నేను తెచ్చే ఆ అయిదువేలూ ఓ పెద్ద స్టీలు షాపులో డిపాజిట్‌లో పెట్టి, సామాను తెచ్చి, ఇన్‌స్టాల్మెంటులలో అమ్మి అది షాపులో కట్టి, మళ్లీ సామాన్లు తెచ్చి...ఇదీ సంగతి!

"శోభా, మరి డబ్బు వసూలు సంగతి?..."

"మీరు మరీ భయస్థులండీ బాబూ! మనం కొన్నవాటికి మనం సరిగ్గా తీర్చటంలేదూ? అలాగే అందరూనూ! ఒకరిద్దరు ఓ నెలలో మానేసిన ఫర్వాలేదు, పై నెలలో వసూలు చేసుకోవచ్చు. పైపెచ్చు ఇలాటివి అన్ని వ్యాపారాల్లోనూ వుంటాయి, మీకు తెలీదుగానీ!" ఒకేదెబ్బతో నా ఎం. కాం. డిగ్రీ దమ్మిడీకి పనికి రాకుండా పోయింది!

శోభ కోరుకొన్నట్లుగానే కాక, నా అంతరాంతరాల్లో వుండే డబ్బు సంపాదించాలనే కోరికవల్ల కాబోలు, నేను లోన్‌కోసం అప్లయి చేయటం, డబ్బు తీసుకొని, అదంతా శోభ చేతిలో పొయ్యటం జరిగింది — "శోభా — అయిదువేలు, జాగ్రత్త సుమా! వ్యాపారం అంటే అంత తేలిక అనుకోకు!"

ఓ చిరునవ్వుతో నా హెచ్చరికను తోసిరాజంది.

రెండురోజుల తర్వాత ఆఫీసునుంచి యింటికి తిరిగివచ్చేసరికి, శోభ ఇల్లంతా ఆకారం మార్చేసింది. మొట్టమొదట, గదిలో వుండే నా రీడింగ్ టేబిల్, బెడ్ రూంలో ఓ పక్కకు వెళ్లిపోయింది. ఇంతక్రితం వుండే ఒకే ఒక్క ఫ్రేము కుర్చీకి బదులుగా ఇప్పుడు ఆ గదిలో రెండు గార్డెన్ మడతకుర్చీలు, ఓ తివాసీలాంటి జంబుఖానా, ఓ పక్కన ఓ చెక్క అలమారు ... ఓ, యిల్లంతా అట్టహాసంగా వుంది.

"శోభా — ఇల్లంతా బాగా మార్చేసావే!" అన్నాను నేను.

శోభ ముఖం మరింత వెడల్పయింది. ఆమె కళ్లు మరింత విశాలం అయ్యాయి. మనసులోంచి పొంగి వచ్చేస్తున్న సంతోషాన్ని ప్రకటించకుండా వుండటానికి విశ్వప్రయత్నంచేస్తూ అంది — "చూస్తూ వుండండి. మన యిల్లు యింకా మారకపోతే నా పేరు శోభే కాదు!"

"అంతా వ్యాపారంవల్లనే?"

అవునన్నట్లుగా గర్వంగా తల ఊపింది శోభ. శోభకున్న ఆత్మవిశ్వాసం నాకెంతో ఆత్మబలాన్ని చేకూర్చిపెట్టింది. అలమారు తలుపుతీసి, తళతళ మెరుస్తున్న స్టీలు గిన్నెలను చూపిస్తూ అంది — "ఇవిగో యివి తెచ్చాను మొట్టమొదట వీటి అమ్మకాన్నిబట్టి, డిమాండునుబట్టి మళ్లీ కొత్త కొత్త వస్తువులు తెచ్చుకోవచ్చు. ఇదిగో, ఈ గిన్నె చూశారా, యిది షాపులో కొంటే యాభై యెనిమిది మనం ఇన్‌స్టాల్మెంటులలో యిస్తే అరవైకి యివ్వచ్చు మూడు ఇరవైలు అరవై. అందులో



గవర్నమెంట్ సోప్ ఫ్యాక్టరీ, బెంగుళూరు వారి నాణ్యమైన ఉత్పాదన.
మార్కెట్ చేయువారు: మైసూర్ సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, బెంగుళూరు
PD-54 Tel

పది మనకూ, యాభై షాపువాడికీ!..."

శోభ వివరంగా చెబుతున్నది వింటొంటే నాకు మతి పోతోంది. శోభకు యింత తెలివి ఎక్కడిదబ్బా ?

శోభ కేవలం మాటకారే కాక కార్యవాదికూడా అన్న సంగతి ఇంకో మూడు నాలుగు రోజులకే తెలిసిపోయింది నాకు. ఆఫీసునుంచి యింటికి వచ్చేసరికి ముందు గదినిండా ఆడవాళ్లు — వాళ్ళ సైజులకు తగ్గట్లుగా గరిటెలు, కంచాలు, చెంబులు, గిన్నెలు ముందువేసుకుని కూర్చున్నారు. శోభ పనితనంమీద నాకు అభిమానం పెరిగి, ఓ నెలలో ఎపుడో కొంచెం బోనస్ ఇద్దామను కున్నాను. అయినా కష్టమంతా శోభదేగదా!

వాళ్ళందర్నీ పంపేశాక, గదిలోకి వస్తూ అంది శోభ — "చెబితే నమ్మారుగాదు, విన్నారు గాదు. ఈ వేళకు అపుడే వెయ్యిరూపాయలపైగా అమ్మేశాను... ఈ వ్యాపారం మనం ఇంకొంచెంకాలం ముందే మొదలుపెడితే బాగుండేది — పోనిండి, యిప్పటికన్నా నిద్రలేచాం!" 'లేచాం' అని గౌరవంకొద్దీ అంటోందేకానీ, లేచింది తానొక్కతే అన్న సంగతి శోభకు బాగా తెలుసు.

నెల గడిచిపోయింది. మొదటి రోజున జీతం అందుకొంటున్నానన్న మాటేగానీ నాకు ధ్యాసంతా శోభ ఆర్జించబోయే లాభంమీదే వుంది. ఇంటికి వచ్చి, మామూలు అలవాటు ప్రకారం నెల జీతంలో ఆరొందలు శోభకు యింటి యాజమాన్యంకొరకు యిచ్చేశాను. నోట్లన్నీ భద్రంగా అందుకొని వెళ్లింది శోభ.

ఏ విశేషం లేకనే ఆ రాత్రి గడిచిపోయింది.

మర్నాడూ అంతే!

మూడో రోజు రాత్రి యింక ఉండబట్టలేక పోయాను. ఇంటి పని అంతా పూర్తిచేసుకొని, గదిలోకి వచ్చిన శోభను ముందుగా ఆ ప్రశ్నే వేశాను. — "శోభా, మన వ్యాపారం సంగతే చెప్పావు కావు! కలెక్షన్స్ ఎంతయ్యాయి ? —"

నాలిక కొరుక్కొంటూ అంది శోభ — "అరె, చెబుదామనుకొంటూనే మర్చిపోయానండీ — కలెక్షన్స్ ఇవిగో!" అంటూ లేచి, హేండ్‌బాగ్‌లో పెట్టి నోట్లు తెచ్చింది ఖచ్చితంగా ఎనిమిది పది రూపాయల నోట్లు!

ఆశ్చర్యపోయాను — "శోభా! యిదేమిటి, ఎనభైయే వున్నాయి ?"

"అవునండీ — ఎనభైయే వున్నాయి."

"అదేం ?"

"అదేం అంటారేం ? — మాధవివాళ్లకు మనం ముప్పైరెండు యివ్వాలి. వాళ్ళు మనకు ముప్పై యివ్వాలి. ఆవిడ యిచ్చినవి రెండు! కృష్ణవేణి వాళ్లకు మనం, మనకు వాళ్లు నలభై రూపాయలు యివ్వాలి — కనుక చెల్లు!! ఇంట్లోకి వుంటుందనుకొన్న తివాసీ, అదే మీ జంబుఖానాకు మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ పది యిచ్చాను. కొన్న కుర్చీలకు ముప్పై యిచ్చాను. అలమారు, కుమార్ వాళ్ల దగ్గర్నుంచి తెచ్చాంగదా — వాళ్లు తీసుకెళ్లిన సామాన్లకు, మన అలమారుకు చెల్లు వేసేసా..." శోభ యింకా చెబుతూనే వుంది.

నాకు స్పృహ తప్పేనంత పని అయింది. ఏమిటిదంతా ? — వ్యాపారం అంటూ శోభ, వెనకటి మారకపు రోజులను నాకు గుర్తుకు తెస్తోంది. ఇలా అయితే... ఇంకా వ్యాపారం ఏమిటి ?

అదే అడిగాను శోభను.

"శోభా — అంటే, మనం ఈ నెలలో వెయ్యి రూపాయల సామాన్లు యింట్లోకి కొనుక్కున్నా మన్న మాట!"

శోభ క్షణం ఆలోచించి, చిన్నగా నవ్వి, అంది— "ఇల్లన్న తర్వాత సామాన్లు కొనుక్కోవాలి. వ్యాపారం అన్న తర్వాత ఇలాటివి ఎదుర్కోవాలి!"

అంటే ...? రాబోయే రోజులను తలుచుకొని నా మనసు మరొక్కసారి వణికింది.



daCunha/CS/19 TL